## పిచ్చికుక్క స్వైరవిహారం

### 20 మందికి గాయాలు

కుక్కదాడిలో గాయపడిన మహిళ

**పలాస :** పలాస సీతమ్మతల్లి మార్కెట్ నుంచి కెటి రోడ్డు మధ్య పిచ్చికుక్క శుక్రవారం స్వైరవిహారం చేసింది. జనంపై విరుచుకుపడి 20 మందిని గాయపరిచింది. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేసింది. చేతులు, కాళ్లపై కరవడంతో భయాందోళనకు గురయ్యారు. క్షతగాత్రులను పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

# ప్లాంట్ ప్రైవేటీకరణను ప్రతిఘటించాలి

- ప్రభుత్వరంగ సంస్థను కాపాడుకోవడం అందరి బాధ్యత
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- రెండో రోజూ కొనసాగిన బైక్ యాత్ర

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, విలేకరుల యంత్రాంగం**

బైక్ యాత్రను నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలను అంతా ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర జిల్లాలో రెండో రోజు శుక్రవారం శ్రీకాకుళం నగరం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట ప్రాంతాల్లో సాగింది. తొలుత శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ద్వారా లక్ష మంది ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ వల్లే ఉత్తరాంధ్రలో వలసలు తగ్గాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని, అదానీ పోర్టుకు ఉపయోగపడేలా స్టీల్‌ప్లాంట్‌ను మార్చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ కుట్రలకు పాల్పడుతుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన నోరు మెదపడం లేదని విమర్శించారు. జిల్లాలోని భావనపాడు పోర్టు, విశాఖలోని గంగవరం పోర్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి అప్పగించేశారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కటినీ ప్రయివేట్‌పరం చేస్తున్నాయని విమర్శించారు. బైక్ యాత్ర ముగింపు సందర్భంగా విశాఖలో ఈనెల 29న నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పలాస : మాట్లాడుతున్న లోకనాథం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందాలని అప్పట్లో కే.శే సర్దార్ గౌతు లచ్చన్న తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష నేడు ఉక్కు పరిశ్రమకు మద్దతు పలుకుతారో లేదో చెప్పాలన్నారు. ఉక్కు పరిశ్రమ ద్వారా లక్ష మందికి ఉపాధి దొరుకుతోందని, పరిశ్రమను అభివృద్ధి చేస్తే మరో 25 వేల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాల్లేక విశాఖపట్నం, ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని, వలసలు నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మేస్తాం, మూసేస్తామంటూ బిజెపి చెప్పడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో స్టీల్‌ప్లాంట్ వచ్చిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ కోసం రూ.4,500 కోట్లు ఇస్తే స్టీల్‌ప్లాంట్ ఇప్పుడు 45 వేల కోట్లను డివిడెండ్ల రూపంలో చెల్లిస్తోందని చెప్పారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సరఫరా చేసిన స్టీల్‌ప్లాంట్ ప్రాణాలనే తీసేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న దుర్మార్గాన్ని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు వ్యవరిస్తున్న తీరును ప్రజలకు వివరించడానికే బైక్ యాత్ర చేపట్టామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలన్న మోడీ సర్కార్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న విగ్రహానికి, డే అండ్ నైట్ వద్ద ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న, ఎన్‌జి రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ కూడలి నుంచి డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, జిటి రోడ్డు, సూర్యమహల్ కూడలి, రామలక్ష్మణ కూడలి మీదుగా నరసన్నపేటకు చేరుకున్నారు.

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

యాత్రలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమ నాయకులు శ్రీనివాస్, నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు టి.తిరుపతిరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వి.జి.కె మూర్తి, ప్రభాకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి గన్నయ్య, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు జాతాకు స్వాగతం పలికారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాటారు. టెక్కలి చేరుకున్న యాత్రకు సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు ఎన్.షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వాగతం పలికారు. నందిగాం హైవే మీదుగా కాశీబుగ్గ వెళ్తున్న యాత్రకు ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నినాదాలు చేస్తూ ఉత్సాహపరిచారు. కాశీబుగ్గ బస్టాండ్‌కు చేరుకున్న బైక్ యాత్రకు జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, కె.వినోద్ కుమార్, ఎల్.భోజరాజు, కె.హేమారావు చౌదరి, కొబ్బరి రైతు సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ బి.లక్ష్మీనారాయణ, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, ఆర్.దిలీప్ కుమార్ తదితరులు స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి నాయకులు చంటి ఆధ్వర్యాన కళారూపాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అంతకుముందు కాశీబుగ్గలో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇచ్ఛాపురం : నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

# వంచనకు జిపిఎస్ పరాకాష్ట

- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి
- ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మదన్మోహన్
- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు విధులకు హాజరు

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఇచ్ఛాపురం**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని అమలు చేసేందుకు కేబినెట్ తీర్మానించడం వంచనకు పరాకాష్ట అని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ అన్నారు. జిపిఎస్ విధానాన్ని నిరసిస్తూ ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సిపిఎస్‌ను రద్దు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నయవంచనకు పాల్పడుతోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే వారం లోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమైందని ప్రశ్నించారు. మాట తప్పను, మడమ తిప్పను, విశ్వసనీయత కోల్పోతే పదవిలో కొనసాగను అనే ముఖ్యమంత్రి మాటలను ఉద్యోగ, ఉపాధ్యాయులు నమ్మి, జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావడానికి సహకరిస్తే దగా చేస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల్లో హామీ ఇవ్వని అనేక రాష్ట్రాలు ఇప్పుడు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దిశగా సాగుతుంటే, హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జిపిఎస్ విధానం దేశానికే ఆదర్శమని వైసిపి ప్రభుత్వ పెద్దలు చెప్పడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో అమలు చేస్తున్న జిపిఎస్ దేశానికి ఎలా ఆదర్శమవుతుందో చెప్పాలన్నారు. తమకు పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఘోషిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం తగదన్నారు. పాత పెన్షన్ విధానానికి జిపిఎస్ ప్రత్యామ్నాయం కానే కాదన్నారు. ఒపిఎస్ సాధించే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించిన వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. పాత పెన్షన్ సాధనకు ఈనెల 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**జిపిఎస్ వద్దు**

జిపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద జిపిఎస్ విధానం వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి, రెవెన్యూ అధికారి శ్రావణ కుమార్, మండల సర్వేయర్ తవిటినాయడు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### ఎస్‌పి జి.ఆర్ రాధిక

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

**ప్రజాశక్తి - కంచిలి**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కంచిలి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్, విచారణలో ఉన్న కేసు ఫైళ్లను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల దర్యాప్తులో పారదర్శకతను పాటించాలని, మహిళలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తుపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కాబట్టి సరిహద్దు ప్రాంతాలపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. ముఖ్యమైన కూడళ్ల వద్ద సిసి కెమెరాలతో పహారా కాయాలన్నారు. దొంగతనాలు జరగకుండా సిసి కెమెరాల ఏర్పాటు, రాత్రి గస్తీలు పెంచాలన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించి సత్వరమే స్పందించాలన్నారు. పలు కేసుల్లో పట్టుబడిన కేసు ప్రాపర్టీ వాహనాలు పరిశీలించారు. కంచిలి పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం, సిసి కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి, సోంపేట సిఐ రవిప్రసాద్, ఎస్‌ఐ బాలరాజు, సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు ప్రియమణి

**పలాస :** రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పలాసకు చెందిన శిష్టు ప్రియమణి ఎంపికైంది. ఆమె స్థానిక విద్యావాహిని జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ తిరుమల శుక్రవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ఈ నెల 30 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల వద్ద జరగనున్న సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటుందని వెల్లడించారు. ఇటీవల సానివాడలో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి, శ్రీకాకుళం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిలో పోటీతత్వాన్ని పెంచాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ సమావేశ మందిరంలో ఇంటాక్, న్యూఢిల్లీ శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యాన యువ టూరిజం క్లబ్ యువతకు రాత, క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఇంటాక్ కన్వీనర్ ఎన్.సన్యాసిరావు మాట్లాడుతూ దేశ సంస్కృతి, చరిత్ర, పర్యాటక ప్రాభవం గురించి నేటితరానికి తెలపడం ప్రధాన ధ్యేయంగా ఈ పోటీలను ఇంటాక్ నిర్వహిస్తోందన్నారు. కో-కన్వీనర్ వావిలపల్లి జగన్నాథం నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పలు పాఠశాలలో ఏర్పాటైన 50 యువ పర్యాటక క్లబ్‌ల నుంచి విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో వికాస్ ఉన్నత పాఠశాల రామకృష్ణ నగర్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. ద్వితీయ స్థానాన్ని వికాస్ హైస్కూల్ శ్రీకాకుళం, బుద్ధ హైస్కూల్ కళింగపట్నం సంయుక్తంగా గెలుచుకున్నారు. ఇంటాక్ సమన్వయకర్త కొమ్ము రమణమూర్తి మాట్లాడుతూ ప్రథమ స్థానం పొందిన వికాస్ హైస్కూల్ బృందాన్ని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, పోటీలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, కె.వి.జె రాధాప్రసాద్, మోహన్, హారికా ప్రసాద్, చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

## నేడు 5కె రన్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్ 5కె రన్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి అరసవల్లి కూడలి వరకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారథాన్‌లో 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థులు పాల్గొనాలన్నారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ.పది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఏడు వేలు, తృతీయ బహుమతి రూ.ఐదు వేలు అందజేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9494474266 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

# 'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

### ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

**ప్రజాశక్తి - పాతపట్నం**

జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి, కొత్తూరు మండలాలకు చెందిన పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. గుమ్మగడ్డకు గండ్లు పడడంతో పంట పొలాల్లోకి వరద నీరు రావడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని స్థానిక రైతులు వినతిపత్రాలు అందించారు. విద్యుత్ సమస్యలు, తాగునీరు, రహదారి సమస్యలపై పలువురు విన్నవించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

## ఎవరూ భయపడొద్దు

### టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

**పలాస :** రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో చేశారని, ఆయన చేసిన కష్టం ఊరికే పోదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. త్వరలోనే మచ్చలేని చంద్రుడిగా తిరిగి వస్తారన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. టిడిపిని అందరం కలసికట్టుగా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చిన రెండు తీర్పులు ఊహించిన తీర్పులేనన్నారు. వైసిపి నాయకులు తప్పుడు కేసులు పెట్టి రాక్షసత్వంతో పైశాచికానందం పొందుతున్నారన్నారు. లోకేష్‌ను అరెస్టు చేస్తారని భయపెడితే భయపడే వారు లేరన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

# వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**

వికలాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. చట్టాలు, హక్కులపై వారు అవగాహన పెంచుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల చట్టంలోని పలు అంశాలపై నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీతో జిల్లా వయోవృద్ధులు, హిజ్రాలు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల సంక్షేమం, హక్కుల కోసం వికలాంగుల హక్కుల చట్టాన్ని భారత ప్రభుత్వం రూపొందించిందన్నారు. సంస్థలు, ఆస్పత్రులు, పాఠశాలల్లో వికలాంగులపై వివక్ష చూపినా, వారిని నిర్లక్ష్యం చేసినా సెక్షన్-92 ప్రకారం కేసు నమోదు చేస్తారని చెప్పారు. రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులకు పెన్షన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్రైసైకిళ్లను ప్రభుత్వం అందిస్తోందని, అర్హులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తోందన్నారు. వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. వ్యాపారాలకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తామని లీడ్ బ్యాంక్ ఎజిఎం జి.సూర్యారావు తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ అనురాధ, డిసిహెచ్ ఎస్.భాస్కరరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

## విద్యార్థులకు క్రీడలు అవసరం

**ప్రజాశక్తి - పలాస**

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ప్రభుత్వ హైస్కూల్ పలాస హెచ్‌ఎం డి.దాశరథి అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కబడ్డీ కోకో, అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ పి.తవిటయ్య, పలాస మండలం ఇంచార్జ్ సిహెచ్ పద్మలోచన, మందస మండలం ఇంచార్జ్ ఎస్ రామారావు, ఫస్ట్ జోన్ సెక్రటరీ పి. గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘ కార్యాలయం ప్రారంభం

**ఆమదాలవలస :** మండలంలోని నెల్లిపర్తి పంచాయితీలో గల మహిళా స్వయం శక్తి సంఘాలతో ఏర్పాటైన మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం 1995 చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తమ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం కార్యాలయాన్ని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సర్పంచ్ మానుకొండ రాజేశ్వరి ప్రారంభించి మహిళలకు అప్పగించారు. ఈ సంఘంలో 42 స్వయం శక్తి సంఘాలలో 494 మంది సభ్యులుగా ఉన్నారు. 22 సంఘాలు ఎ-గ్రేడ్‌లో, 16 సంఘాలు బి- గ్రేడ్‌లో, 4 సంఘాలు సి-గ్రేడ్‌లో ఉన్నాయి. ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ, ప్రస్తుతం 96 శాతం తీసుకొన్న రుణాలను రీపేమెంట్ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని అర్హులంతా రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. సొంత కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి మానుకొండ ధనలక్ష్మి, క్లస్టర్ కోఆర్డినేటర్ సుభద్ర, విఒఎలు రమ తదితరులు పాల్గొన్నారు.

# సవరణతో మహిళా బిల్లును అమలు చేయాలి

**పలాస:** ఒబిసి, మైనారిటీ సవరణ లేకుండానే యథాతథంగా మహిళా బిల్లును తీసుకురావడం అభ్యంతరకరమని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ అన్నారు. కాశీబుగ్గలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇన్నేళ్లు ప్రధానంగా బిల్లుకి అడ్డుపెట్టిన అంశాలను, దానికి కావాల్సిన కుల, జన, గణనను పక్కకు పెట్టి, పితస్వామ్య, కుల దురహంకారంతో తొక్కిపెట్టిన ఈ బిల్లుకి మోక్షం కలిగించినట్లుగా చెప్పుకోవడం వెనుక ఉన్న కపట, అవకాశవాద రాజకీయాలను అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బిల్లులో ఇప్పటికే అమలవుతున్న ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు తప్ప బహుజన, మైనారిటీ కులాల్లోని మహిళల ప్రాతినిధ్యం లేదన్నారు. అన్ని రంగాల్లో సమ భాగస్వామ్యం మహిళల హక్కుగా గుర్తించాలని, అప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తి అవుతుందన్నారు. సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుహాసిని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

సమన్వయంతో బాధితుల సమస్యలు పరిష్కరించడమే బ్రెడ్స్ ధ్యేయమని ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జెవి రమణ అన్నారు. మండల కేంద్రంలో బ్రెడ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో సమావేశం శుక్రవారం నిర్వహించారు.. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందని వారితో పంచాయతీ సర్పంచ్‌లు, మండల అధికారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి. సరోజిని, ఎంపిడిఒ పి. చంద్రకుమారి, ఎపిఒ రవి, ఎపిఎం లలిత, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రామస్తులు చెబుతున్న సమస్యలకు సమాధానాలిస్తూ పలు సమస్యలపై వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మండలంలో 18 గ్రామాలలో ప్రకతి వ్యవసాయం ద్వారా పంట పండిస్తున్న తీరును రమణ వివరించారు. పంచాయతీ సర్పంచులు సిద్ధిపాలెం గౌరీస్, పెద్ద బొంతు అప్పారావు, జనార్ధనరావు, బ్రెడ్స్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న హరిబాబు

## పళ్ల తోటల పెంపకంతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - రణస్థలం

పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ ఆహార, ఆరోగ్య అవసరాల దృష్ట్యా వ్యవసాయ పంటల సాగుతో పాటు పళ్ల తోటలు సాగు చేపట్టడం అత్యంత అవసరమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శుక్రవారం రణస్థలం మండలంలోని కోష్ట గ్రామ సమీపంలో గల తమ నర్సరీలో రైతులకు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పళ్ల తోటల పెంపకం వల్ల పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాక గ్రామీణ ప్రజలకు అదనపు ఆదాయం చేకూర్చి ఆర్థిక భరోసా కల్గించాలనే ఉద్దేశంతో జిల్లావ్యాప్తంగా వ్యవసాయ అటవీ పెంపక కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మామిడి, జీడి మామిడి, సపోటా, నిమ్మ, కమల, జామ తదితర పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రణస్థలం మండలం సమీప వెంకటరావుపేటలో వైఎస్ఆర్ కాలనీ పక్కన తమ నర్సరీ వద్ద సంప్రదించి కావాల్సిన మొక్కలు పొందవచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్, పి.తవిటినాయుడుతోపాటు సమన్వయకర్తలు పి.రమణ 7799332544, రావాడ కష్ణ 9063351310లను, సెల్ నంబర్ 9989284817, సంప్రదించవచ్చునని సూచించారు.

## మహిళా రిజర్వేషన్ చారిత్రాత్మకం

### వైసిపి నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందటం అఖిల భారతావనిలో అత్యుత్తమమైన పరిణామమని, దేశంలో మహిళలకు ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని వైసిపి నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. మెడికవర్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. భారతదేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు ప్రస్తుతం 5 నుంచి 10 శాతం మాత్రమే చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ దేశ ప్రధాని నరేంద్రమోహన్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దేశ పురోగాభివద్ధికి యువత శక్తే కీలకమని, దేశ జనాభాలో 60 శాతం వరకు యువత ఉండడం వల్లే శరవేగంగా అభివద్ధి చెందుతోందని మోదీ చెబుతుంటారన్నారు. దేశంలో వారసత్వ పాలనకు ప్రోత్సహిస్తున్నారని దీనివల్ల రాజకీయ ప్రాతినిధ్యం, అధికారం కేవలం 5 నుంచి 10 శాతం కుటుంబాల్లో చేతుల్లో ఉండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత నిరాశ, నిస్పహలకు గురై రాజకీయాలకు దూరంగా ఉంటున్నారన్నారు. పార్లమెంట్‌లో 7 సార్లు, ఎనిమిది సార్లు ఎంపీలుగా గెలిచిన వారే ఉన్నారని, యువతరానికి ఎప్పుడు అవకాశాలు వస్తాయని ప్రశ్నించారు.

రుణాల దరఖాస్తులను స్వీకరిస్తున్న మేనేజర్ మూర్తి

## ఆహార ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాలలో ఆదాయ అభివద్ధి కార్యక్రమాలను చేపడుతున్న మహిళా ఎంటర్ప్రెనర్స్‌కు అధికంగా ప్రోత్సహిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బిఎఎన్ మూర్తి తెలిపారు. శుక్రవారం స్టేట్ బ్యాంకులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పాడి పరిశ్రమ, డెయిరీ యాక్టివిటీస్, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల ఫారాలు ఏర్పాటు, ఆహార ఉత్పత్తుల తయారీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, కోశాధికారి రేణుక, కార్యదర్శి వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 24న జిల్లా జట్టు ఎంపిక

**టెక్కలి :** ఈనెల 24న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్-18 రగ్బీ జిల్లా జట్టు ఎంపిక చేపట్టనున్నామని నిర్వాహక కార్యదర్శి బాడాన నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005, 06, 07 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపికకు హాజరు ఆయినప్పుడు క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం తీసుకుని రావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 1, 2 తేదీల్లో కర్నూల్‌లో జరగనున్న 9వ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## అరసవల్లిని సందర్శించిన ఎమ్మెల్సీ

**శ్రీకాకుళం అర్బన్ :** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ శాసన మండలి సభ్యులు సేరి సుభాష్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయనను ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం వారికి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**పొందూరు :** పొందూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపిపి కిల్లి ఉషారాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యలక్ష్మితోపాటు కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ప్రతి సెక్షన్‌కు సంబంధించి సిబ్బంది పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరంలో జనవరి నుంచి 56 బిల్డింగ్ ప్లాన్ దరఖాస్తులు వచ్చాయని, ఆ ప్లాన్‌ల ద్వారా రూ.12.37 లక్షల ఆదాయం వచ్చిందని, లేఔట్స్ స్టేటస్ అడుగుగా 4 లే ఔట్లకు అనుమతి ఇచ్చామని, ఇంకా నాలుగు అనుమతి లేని లే ఔట్లున్నాయని టిపిఎస్ చెప్పారు. డి పట్టా భూములకి ఎన్ని ప్లాన్లు ఇచ్చారని, రీ సర్వే పని తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ సెక్షన్‌ను సమీక్షించగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 3.11 కోట్ల డిమాండ్ కి రూ.83 లక్షలు వసూలైందని, షాప్ రూమ్ విషయలో 40 లక్షల వరకు వసూలు చేశామని, ఇంకా రూ. 35 లక్షలు బకాయిలు వసూలు చేయాల్సి ఉందన్నారు. అకౌంట్ సెక్షన్‌లో డిజిటల్ బుక్ ద్వారా పెండింగ్‌లో ఉన్న మొబైల్ టాయిలెల్లు బిల్లును వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి 2021 సంవత్సరం నుంచి జనరల్ ఫండ్ 71 పనులకుగాను రూ.1.60 కోట్ల వరకు ఆమోదించగా, 38 పనులకుగాను రూ.92 లక్షలు వరకూ పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు పరిశీలనలో ఉన్నాయని అన్నారు. నాడు నేడకు సంబంధించిన 90 శాతం, అర్బన్ హెల్త్ సెంటర్‌కు సంబంధించి 95 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. శానిటేషన్ సెక్షన్‌కు సంబంధించి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఎక్కువగా వర్షాలు కురవడం కారణంగా ప్రజలు వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉందని, ఒకే చోట డ్రైనేజీలో నీరు నిలవకుండా చూసుకోవాలని, ప్రతి వార్డులో బ్లీచింగ్ వంటివి స్ప్రే చేయాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ హరి మోహన్, ఎఇ ఈశ్వరరావు, టిపిఎస్ నారాయణ రావు, అర్ఐ రేవంత్, శానిటరి ఇన్స్పెక్టర్ ఉపేంద్ర, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

# వైసిపిలో ఆగని జగడం

### ఎమ్మెల్యే వద్దంటూ ఫిర్యాదులు

### జగన్ ముద్దంటూ ముక్తాయింపులు

ప్రజాశక్తి - జి సిగడాం

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైసిపిలో గ్రూపుల పోరు మరోసారి రచ్చకెక్కింది. 'జగనన్న ముద్దు - ఎమ్మెల్యే కిరణ్ వద్దు' అంటూ నినాదాలు చేస్తూ వైసిపి అభిమానుల్లో అయోమయాన్ని అసమ్మతి నాయకులు సృష్టిస్తున్నారు. ముఖ్యమంత్రిగా జగన్ నాయకత్వాన్ని బలపరుస్తూ.. స్థానిక నాయకత్వంపై మాత్రం గుర్రుగా ఉంటున్న సంఘటనలు గత కొన్ని రోజులుగా ఇక్కడ బలంగా వినిపిస్తున్నాయి. కష్టించి పని చేసే కార్యకర్తలను విస్మరించి గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారని జి.సిగడాం మండలంలో కొంతమంది సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు బహిరంగంగా మండిపడుతున్నారు. ఇటీవల వాంద్రంగి గ్రామంలో రైతు భరోసా కేంద్రం విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను సర్పంచి, ఎంపిటిసిల ప్రమేయం లేకుండా ప్రారంభించడం సరికాదని వీరు ఉదహరిస్తున్నారు. దీంతో జి.సిగడాంలో వైఎస్ఆర్సిపి నాయకులు, సర్పంచి సాగేటి నాగరాజు, మాజీ సర్పంచ్ బూరాడ వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధులు చిత్తిరి మోహన్, దార బోయిన ధర్మరాజు, పున్నాన అక్కల నాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, పిఎసిఎస్ మాజీ చైర్ పర్సన్ కలిశెట్టి శాంతారాం తదితరులు ఎమ్మెల్యే కిరణ్ వైఖరిని తప్పుపడుతూ శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో నినాదాలు చేశారు. అధిష్టానానికి ఫిర్యాదులు కూడా చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇప్పటికైనా అసమ్మతులను బుజ్జగించకపోతే రానున్న ఎన్నికల్లో కష్టకాలమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు

కిరణ్ వద్దు అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు

## స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

స్కానింగ్ సెంటర్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ప్రజాశక్తి - పలాస

లింగ నిర్ధారణ అనేది చట్టరీత్యా నేరమని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడవాలని ఆర్‌డిఒ సీతారామ్మూర్తి స్కానింగ్ సెంటర్ల యజమానులను హెచ్చరించారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం సబ్ డిస్ట్రిట్ మల్టీ లెవల్ అప్రోవ్‌డ్ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టనిబంధనల ప్రకారం స్కానింగ్ సెంటర్ నడవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్‌కి వచ్చిన ప్రతి రోగి, గర్భిణి వివరాలను రికార్డులో నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయనతోపాటు జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ సూర్య కళ, పలాస డిప్యూటీ డిఎం హెచ్ఒ ప్రసాద్ రావు, కాశీబుగ్గ సిఐ శంకర రావు, డాక్టర్ యు. కిరణ్ కుమార్ డాక్టర్ సురేష్ కుమార్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.20 కోట్లు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మెయిన్ రోడ్డు విస్తరణకు ముఖ్యమంత్రి నిధి నుంచి రూ.20 కోట్లు మంజూరైనట్టు జెడ్‌పి చైర్ పర్సన్ పిరియా విజయ తెలిపారు. శుక్రవారం సోంపేట బస్టాండ్ కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి రోడ్డు విస్తరణకు సంబంధించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొర్లం జాతీయ రహదారి జంక్షన్ నుంచి వయా బారువ మీదుగా లక్కవరం వరకు 4.5 కిలోమీటర్ల రహదారితో పాటు సోంపేట పాత ఎస్‌బిఐ కూడలి నుంచి కంచిలి జాతీయ రహదారి వరకు 66 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు జరిగిందన్నారు. మొదట విడతగా రూ.20 కోట్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారం భించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, తడక జోగారావు, ఎంపిడిఒ వెంకటరమణ, వైసిపి నాయకులు బి. శ్రీకృష్ణ, బి.ధర్మారావు పాల్గొన్నారు.

కొలతలను పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

## మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26వేలు అందించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ సంస్థ కార్యాలయం ఎదుట శుక్రవారం యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. సంఘ నాయకులు షన్ముఖరావు, భాస్కరరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులకు జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని, సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పల రాజు, సలహాదారు చిక్కాల గోవిందరావు, అధ్యక్షులు మాడుగుల రాఘవ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామవాస గణేష్ పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆయుష్మాన్ భవతో వైద్య సేవలను ప్రజల వద్దకే తీసుకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని డిస్టిక్ ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లింగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మోనింగివారి వీధిలోనున్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి రక్త పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు రెండు వారాలపాటు సరికొత్త కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా వార్డులలో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి ప్రజల క్షేమ సమాచారాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, స్టాఫ్ నర్సు జ్యోతి, డేటా ఆపరేటర్ ఎల్.హేమంత్, ఎల్.జి.ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకట్టుకునేలా చూడాలని చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచాలపేట సత్య సాయి కల్యాణ మండపంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సమావేశం సిడిపిఒ విమల కుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. కెవికె సైంటిస్ట్ బి.సునీత మాట్లాడుతూ చిన్నారులకు చిరు ధాన్యాలు అందించటం వలన రోగ నిరోధక శక్తి వస్తుందన్నారు. ఆకు కూరలతో కూడిన ఆహారం అందించడం వలన చిన్నారులు ఆరోగ్యంగా వుంటాన్నారు. అనంతరం అంగవాడి మాసోత్సవాలు నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, సూపర్ వైజర్లు లింగాల శాంతి కుమారి, సుధావాణి, గౌస్య బేగం, ఈశ్వరి, భవాని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

## రైతులకు అవగాహన

**కొత్తూరు :** మండలంలో ఓంద్రుజోల గ్రామంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి బి.రాజగోపాల్ రైతులకు అవగాహన కల్పించారు. 10 శాతం నుండి 20 శాతం వరకు వరి నారుకు పిలకల తొలగింపు, ఆకుల కత్తిరింపు చేసుకోవాలని, కాండం తొలచే పురుగుకోసం, జీవిత చక్రం తదితర విధానాలు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది బి.సౌజన్య, పి.షణ్ముక, వసంత కుమారి పాల్గొన్నారు.

# కొనసాగుతున్న టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశకి - యంత్రాంగం

ఆమదాలవలస పట్టణంలో టిడిపి కార్యాలయం వద్ద నేను సైతం బాబు కోసం రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గంలో నాలుగు మండలాలు మున్సిపాలిటీకి చెందిన దళిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ మాట్లాడుతూ వైసిపి హయాంలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఇసుక కోసం ఓ దళితుడు తూర్పుగోదావరి జిల్లాలో ప్రశ్నిస్తే అక్కడి ఎమ్మెల్యే దళిత యువకుడికి శిరోముండనం చేసిన ఘనత వైసిపి హయాంలోనే జరిగిందని దుయ్యబట్టారు. విశాఖపట్నంలో దళిత డాక్టర్ మాస్కులు అడిగినందుకు పిచ్చివాడన్న ముద్ర వేసి అరెస్టు చేసి మానసికంగా వేధించి ఆయన చావుకు కారణమయ్యారని అన్నారు. చీరాలలో ఓ యువకుడు ఇంటి సామాన్లు కోసం కరోనా టైంలో బయటికి వెళ్తే పోలీసులతో కొట్టి చంపిన ఘనత వైసిపికే దక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం దళితులకు మేలు కంటే కీడే ఎక్కువ చేసిందని మండిపడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గంలో ఓ దళితుడు రూ.60 విలువ చేసే చీప్ లిక్కర్‌ను రూ.200లకు అమ్ముతున్నారని, తాము ఎలా బతికేదని ప్రశ్నిస్తే మరుసటి రోజుకు విగత జీవిగా మార్చడం నేరం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండను దళితులంతా ఎదిరించి ప్రభుత్వాన్ని ప్రశ్నించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోనెల అప్పారావు, గుర్రాల చిన్నబాబు, రాడ విజయ్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి పాల్గొన్నారు.

పోస్టుకార్డుపై రాస్తున్న శివాజీ

కాశీబుగ్గలో చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా శుక్రవారం నియోజకవర్గం పరిధిలో ఉన్న దళిత నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. టిడిపి నాయకులు కార్యకర్తలు పోస్టు కార్డుపై అక్రమ అరెస్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని పోస్టుకార్డు రాస్తూ రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడుని విడిచి పెట్టే వరకు రిలే నిరాహారదీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు వడ్డీ యాదగిరి, జి క్రాంతి, బోనెల భైరాగి, టి.శంకరరావు, బొబ్బిలి సంతోష్, వి. మల్లేష్ పాల్గొన్నారు.

కవిటి మండలం కత్తిరివాని పేట క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో ఎటువంటి నిరసనలు, ధర్నాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కోటబొమ్మాళి తెలుగుదేశం కార్యాలయ అవరణలో చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో టెక్కలి నియోజకవర్గ టిడిపి శ్రేణులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పోరాటం కడవరకూ సాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు అట్టాడ రవిప్రకాష్ ఉన్నారు. క్యాష్ పిటీషన్ సోమవారం హైకోర్టు కొట్టివేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ నేతృత్వంలో కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం చుట్టూ పోలీస్ ప్రత్యేక బృందాలు మోహరించాయి.

మాట్లాడుతున్న రవికుమార్

## లక్కుపురంలో వైద్య శిబిరం

**బూర్జ :** మండలంలో పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న లక్కుపురం గ్రామంలో శుక్రవారం అత్యవసర వైద్య శిబిరం నిర్వహించారు. గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గురువారం వరద నీరు గ్రామాన్ని ముంచెత్తడంతో గ్రామస్తులకు ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎంపిపి కర్నేన దీప ఆధ్వర్యాన ప్రముఖ వైద్యులు రాజశేఖర్ నేతత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. నాగభూషణరావు, కృష్ణమూర్తి, అప్పలస్వామి, సరోజిని, చిన్నమ్మడు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు

**పొందూరు :** మండలంలో లోలుగు కెజిబివిలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ అనసూయ ఆధ్వర్యాన ఈ పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలున్న విద్యార్థులను గుర్తించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అర్. సౌమ్య, సిహెచ్ఓ ఎం.రవికుమార్, ఏఎన్ఎం యోగేశ్వరి, ఆశ కార్యకర్తలు రమణమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

**టెక్కలి :** మండలంలోని పోలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విలియం అభినందించారు. కురుడులో జరిగిన పోటీల్లో పాల్గొన్న తమ పాఠశాల విద్యార్థులు కె.షణ్ముఖ, వై,కార్తీక్, బి.నవదీప్, జి.జశ్వంత్, ఆర్.డిల్లేశ్వరి, కె.అబిషేక్, ఎల్.శ్రీకాంత్‌లను అబినందించారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు పాండవుల జగదీష్, యోగా శిక్షకులు పి.అనిల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

**కంచిలి :** మొక్కలు అధికంగా నాటడం ద్వారానే పర్యావరణ పరిరక్షణకు బాటలు వేయగలమని ట్రూ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. మండలంలోని బిన్నల కొత్తూరులో సుమారు వందకుపైగా తురాయి, చైనా బాదం మొక్కలు రోడ్లకు ఇరువైపులా నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు. కృష్ణం రాజు మాట్లాడుతూ చెట్లు నరకడం వల్ల అధిక ఉష్ణోగ్రతలతో జీవరాశి సతమతమవుతున్నారు.

## కృషితోనే విజయం సాధ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కృషి, పట్టుదల ఉన్నప్పుడే విజయానికి చేరుకోవడం సాధ్యమవుతుందని మాస్టర్ సాయిబాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఎపి డబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. రెండు రోజుల క్రితం పరవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నగరంలోని ఆఫీషియల్ కాలనీలో శుక్రవారం జరిగింది. కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి క్రీడాకారుడు పట్టుదలతో కృషి చేయాలన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ప్రవేశం ఆత్మరక్షణకే కాకుండా దేశ రక్షణకు ఉపయోగపడాలన్నారు. విజయనగరంలో అక్టోబరు 1న జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తొలుత జాతీయస్థాయి పోటీల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ చైర్మన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి. రవికుమార్, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.చంద్రరావు, చీఫ్ కోచ్ గాయత్రీ, గ్రాండ్ మాస్టర్స్ విజయకుమార్, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న వేణుగోపాల్

**విజేతలు వీరే...**

రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సిక్కోలుకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఫైట్స్ విభాగంలో కె. హేనా, ఎన్.శ్రీరాజ్, బి. జగదీష్ రామకష్ణదేవ్, డి.కిరణ్ ప్రథమ స్థానంలో నిలవగా, హేనా, జగదీష్, శ్రీరాజ్ కటా విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. బి. భాను, తేజేశ్వరరావు, కె.హేనా రెండోస్థానం సాధించి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఫైట్స్ విభాగంలో బి. భరత్, సిమ్మన్న, ఎన్.శ్రీరాజ్ రెండో స్థానంలో నిలిచారు.

## కళలకు ఎల్లలు లేవు

**కవిటి:** కళలకు, కళాకారులకు ఎల్లలు లేవని బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరాం ప్రసాద్ అన్నారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని కవిటి మండలం బొరివంక గ్రామంలోని ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నియోజకర్గస్థాయి కాళికా నత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులతో వాద్య సహకారం అందించిన సుమారు 30 మందిని శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో చైతన్యం కలిగిస్తాయని, ఇటువంటి కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహించడం ద్వారా సామాజిక సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ఎంపిటిసి దుద్ది సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో చాపరకు చెందిన గేదెల షణ్ముఖరావు (38) మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి శుక్రవారం మతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...తాగుడు వ్యసనానికి బానిసై కుటుంబానికి దూరమయ్యాడు. ఇతని ప్రవర్తనకు విసుగు చెందిన భార్య తన ఇద్దరు కుమారులతో గ్రామంలోనే వేరేచోట నివసిస్తోంది. దీంతో మనస్తాపానికి గురై. గురువారం పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు గమనించి వైద్యం నిమిత్తం టెక్కలి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మతి చెందాడు. మతుడి తండ్రి గేదెల భీమారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎఎస్ఐ నర్సింగరావు తెలిపారు.

మృతి చెందిన షణ్ముఖరావు

## వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ బెల్లుపడ కాలనీ-2 సచివాలయం పరిధిలోని 13వ వార్డులో నివసిస్తున్న దక్కత యర్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. నామినిగా ఉన్న ఆయన భార్య దక్కత హేమకి వైఎస్సార్ బీమా తరుపున దహన సంస్కారాల కోసం రూ.10 వేలను మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిగిలిన రూ.90 వేలను హేమ అకౌంట్ లో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ బట్టి బాలకృష్ణ, వలంటీర్ బుడుపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ అప్పలనాయుడుపేట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ గుమ్మా బ్లాక్ పరిడి పంచాయతీ తమరాడ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ చెట్టుకు ఢీకొనడంతో గాయపడ్డాడు. హెల్మెట్ ధరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంపై కాశీనగర్ సమూహ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతనికి ప్రథమ చికిత్స జరిపించి, పర్లాకిమిడి తరలిస్తున్నారు. కాశీనగర్ ఐఐసి గోవింద్ గౌర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.